



నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 8 ఆగస్టు 2025 పేజీలు 8


# దసరా మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి..

## ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ



ఎన్‌టీఆర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 7, మేజర్ న్యూస్ : దసరా మహోత్సవాలకు శాఖల సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 22 నుండి నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు దుర్గ గుడి అధికారులు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లను గురువారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనా నాయక్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి దుర్గా ఘాట్, జాతీయ రహదారి, మహా మండపం, కనకదుర్గ నగర్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ దసరా ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని, చేస్తున్న ఏర్పాట్ల పై అధికారులకు పలు సూచనలు చేశారు. గత ఉత్సవాలలో భక్తులకు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పునరావృతం కాకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. మహా మండపం వద్ద ప్రసాదం క్యూ లైన్లను పరిశీలించి భక్తులకు అవసరమైన ప్రసాదాలను అందుబాటులో ఉండేలా చూడాలని ప్రసాదాల నాణ్యత, క్యూ లైన్ల వద్ద పరిశుభ్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ నిషేదాన్ని ప్రకడ్బందిగా అమలు చేయాలని ఆదేశిస్తూ ప్రస్తుతం ఉన్న ప్రసాదం కౌంటర్లను, విక్రయిస్తున్న కవర్లను తనిఖీ చేసి బయోడిగ్రేడబుల్ కవర్లను విక్రయిస్తున్నందుకు కలెక్టర్ సంతోషం వ్యక్తం చేసారు. భక్తుల రద్దీని దృష్టిలో

మిగతా 2లో




### దర్జాగానే తెలంగాణకు మైనింగ్(గ్రావెల్)

# అక్రమ రవాణా

- మామూళ్ల మత్తులో మైనింగ్ రెవెన్యూ పోలీస్ శాఖలు
- అనుమతులు ఒకచోట త్రవ్వకాలు అనేక చోట్ల
- కొండలను పిండి చేసే మైనింగ్(గ్రావెల్) మాఫియా డాన్ దీపక్
- ఈ అక్రమ దందాకు బిగ్ బాస్ దీపకేనా..?

వివరాలు 2లో...

### యూరియా కొరతతో..

# అన్నదాతల ఆందోళన

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్:** యూరియా కొరతతో గుడ్లవల్లేరు మండలంలోని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు సరిపడా యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు.





కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా కొందరు వ్యాపారులు ఎరువుల ధరలు ఇష్టానుసారంగా పెంచేసి అమ్ముతుండటంతో రైతులకు భారం తప్పడం లేదు. ప్రభుత్వాలు మారినా రైతులకు యూరియా కొరత తప్పడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్‌లో

2

# పర్యవేక్షిస్తూనే ఉంటాం

## పామర్రులో ఆకస్మిక తనిఖీలు చేసిన రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్ విజయ ప్రతాప్ రెడ్డి

**పామర్రు ఆగస్టు 7 మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ సిహెచ్.విజయ ప్రతాప్ రెడ్డి గురువారం పామర్రు మండలంలో పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. పామర్రులో వెనుకబడిన తరగతుల బాలికల వసతి గృహం, అదేవిధంగా నిమ్మకూరులోని నందమూరి లక్ష్మయ్య వెంకట్రావమ్మ గురుకుల విద్య పాఠశాల, కళాశాల వసతిగృహం, పామర్రు మండలం ఎన్టీఆర్ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రం, కంచర్లవానిపురం అంగన్వాడి కేంద్రం, జుజ్జువరం ప్రైమరీ స్కూల్లో భోజన వసతులు, అదేవిధంగా పామర్రు గ్రామంలో యడ్ల అప్పారావు నిర్వహిస్తున్న ఉచిత రేషన్ పంపిణీ కేంద్రం సందర్శించి తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఆయన ఆయా వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారికి అందుతున్న భోజన వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సూచించిన అల్పాహారంలో మార్పులు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నిమ్మకూరు గురుకుల పాఠశాలలో నెలకు 35 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, ఒకేసారి 120 క్వింటాళ్ల బియ్యం సరఫరా చేయడంతో నిల్వ బియ్యానికి పురుగులు పట్టి పాడైపోతున్నట్లు చైర్మన్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత పై అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య పునరావృతం కాకుండా చూడాలని, అదేవిధంగా విద్యార్థులకు చిక్కి సరఫరా కావడం లేదని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు మెనూలో సూచించిన పరిమాణం ప్రకారం చికెన్ అందించాలని వసతి గృహ నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకము, అంగన్వాడీ వ్యవస్థ, సంక్షేమ వసతి గృహాలు, పీఎం మాతృ వందనం పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మొదటి డెలివరీకి రూ. 5 వేలు, రెండవ డెలివరీకి ఆడపిల్ల అయితే రూ. 6 వేలు ఇచ్చే పథకాలను



ప్రధానంగా ఫుడ్ కమిషన్ పర్యవేక్షిస్తుందన్నారు. ప్రభుత్వం నుండి ఉన్నత పాఠశాల స్థాయి వరకు ఒక్కో విద్యార్థికి నెలకు రూ.14 వందలు, అదేవిధంగా ఇంటర్మీడియట్ కంటే పై చదువులు చదువుతున్న

మిగతా 2లో...

(మొదటిపేజీ తరువాయి)

## దసరా మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయండి..

ఉంచుకొని, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన ముందస్తు భద్రతా ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ పరిసరాలు, క్యూ లైన్లు, ప్రసాదం పంపిణీ ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి వి.కె. శీనానాయక్ ఈ ఏడాది కనకదుర్గ నగర్‌లో 10 ప్రసాదం కౌంటర్లతో పాటు అదనంగా 8 చోట్ల మొత్తంగా 18 ప్రసాదం కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా ఆలయ పరిధి, వివిధ ప్రదేశాలలో 250కు పైగా సిసి కెమెరాలతో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసందానించి పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్‌కు వివరించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.వి.ఎస్ఆర్ కోటేశ్వరరావు, డిఇలు రవీంద్ర, అశోక్‌లు ఉన్నారు.

## యూరియా కొరతతో అన్నదాతల ఆందోళన

వరి పంట సాగు చేసే రైతులకు ఎరువుల కొరత ముఖ్యంగా యూరియా కోసం నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు కావాలంటే ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తుంది. యూరియా కోసం రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుంది. యూరియా నిల్వలు వచ్చిన రోజు సాయంత్రంలోపే పూర్తిగా అయిపోతుండడం, తిరిగి నిల్వలు రావడానికి 5 లేదా వారం రోజుల సమయం వేచి ఉండాల్సి రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల దుకాణాల్లో కూడా యూరియా కొరత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ముఖ్యంగా గుడ్లవల్లేరు మండలంలో వ్యాపారులు కృత్రిమ కొరత చూపిస్తున్నట్లు తెలుస్తుంది. రైతులకు అవసరం లేకపోయిన వ్యాపారులు సూచించిన ఎరువులు తీసుకుంటేనే యూరియా ఇవ్వడం, యూరియాను అధిక ధరకు అమ్మకాలు చేపట్టడం చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో గుడ్లవల్లేరు మండలంలో 22500 ఎకరాల్లో వరి సాగు చేసారు. ఎకరాకు 2 బస్తాలు వినియోగించినప్పటికీ 45000 బస్తాల యూరియా అవసరం ఉంటుంది. ఈ ఖరీఫ్ మొత్తానికి 2250 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా ప్రస్తుతం 900 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అయితే పెద్ద రైతులు యూరియా నిల్వ చేయటంతో సన్న, చిన్నకారు రైతులు క్యూలో నిలబడి ఇబ్బందులకు గురవుతున్నారు. పెద్ద రైతులు ఎవ్వరూ దుకాణాల వద్ద క్యూలైన్లలో లేకపోవడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వరి పంట సాగుచేసే రైతులకు యూరియా కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కొరత రాకుండా చర్యలు : ఏఓ సునీల్**

మండలంలో యూరియా కొరతపై వ్యవసాయ అధికారి ఎల్. సునీల్ మాట్లాడుతూ యూరియా అవసరం మేరకు పంపిణీ చేస్తున్నాం. రైతులు యూరియాను అవసరం మేర కంటే అధికంగా వినియోగిస్తున్నారు. యూరియాను అవసరం మేరకు మాత్రమే ఉపయోగిస్తే ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటివరకు మండలంలో 900 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశాం. ఎంఎల్ఏ వెనిగండ్ల రాము చొరవతో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రస్తుతం 400 మెట్రిక్ టన్నులు ఇండెంట్ పెట్టామని, ఎరువుల కొరత రాకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, కొరత సృష్టించినా, అధిక ధరలకు అమ్మినా డీలర్లపై కఠిన చర్యలుంటాయని ఏఓ సునీల్ తెలిపారు.

## పర్యవేక్షిస్తూనే ఉంటాం



విద్యార్థులకు రూ.16 వందలు వస్తున్నాయని తెలిపారు. పిల్లల్లో పోషకా చేందుకు ఐరన్, పోలిక్ యాసిడ్, బి 12 తదితర విటమిన్లతో కూడిన బియ్యాన్ని పాఠశాలకు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం వారంలో మూడు రోజులు చికెన్, ఆరు రోజులు గుడ్డు భోజనంలో విద్యార్థులకు అందించాల్సి ఉందని, అదేవిధంగా సాయంత్రం స్నాక్స్, ఉదయం పాలు, రాత్రి ఫ్రూట్స్ అందించేలా కమిషన్ పర్యవేక్షిస్తుందని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో పలు అంగన్వాడి కేంద్రాలను సందర్శించిన ఆయన పిల్లల హాజరు రిజిస్టర్లు, గర్భిణి, బాలింతల పౌష్టికాహార తదితర రికార్డులు, నిల్వ స్టాకు క్షుణ్ణంగా పరిశీలించి తనిఖీ చేశారు. పిల్లల కోసం వండిన ఆహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణీ ఫబాలింత తల్లులకు గుడ్లు, పాలు, బియ్యం తదితర సరుకులను ఇస్తున్నారా లేదా అని నేరుగా లబ్ధిదారులతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి జి మోహన్ రావు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జి.రమేష్, ఏపీ ఆర్ జె సి కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీ కుమారి, ఆయా వసతి గృహాల వార్డెన్లు శివలక్ష్మి, నాగాంజనేయులు, అంగన్వాడి సూపర్వైజర్లు ఎస్ విజయ్ కుమారి, ఎం సత్య శ్రీ, అంగన్ వాడి కార్యకర్తలు తదితరులు చైర్మన్ వెంట ఉన్నారు.

# దర్జా గానే తెలంగాణకు మైనింగ్(గ్రావెల్) అక్రమ రవాణా

**మామూళ్ల మత్తులో మైనింగ్ రెవెన్యూ పోలీస్ శాఖలు**

**అనుమతులు ఒకచోట త్రవ్వకాలు అనేక చోట్ల**

**కొండలను పిండి చేసే మైనింగ్(గ్రావెల్) మాఫియా డాన్ దీపక్**

**ఈ అక్రమ దందాకు బిగ్ బాస్ దీపకేనా...?**



**జగ్గయ్యపేట ఆగస్టు 7 మేజర్ న్యూస్ :** మండలంలోని రామచంద్రుని పేట రెవెన్యూ పరిధిలో గల ఆర్ఎస్ నెంబర్ 41/2 లో ప్రభుత్వ అనుమతులు తీసుకుని త్రవ్వకాలు జరుపుతున్నట్లు ఓ అక్రమార్కుడు రికార్డులను చూపిస్తున్న వైనం ఈ ప్రాంతంలో చర్చనీయంగా మారింది . ఆ అక్రమార్కుడు ఒక రికార్డును అడ్డం పెట్టుకొని అనేకచోట్ల తవ్వకాలు జరుపుతూ యదేచ్ఛగా అక్రమార్జన పాల్పడుతున్నట్లు ఆ గ్రామస్తులు నుండి సమాచారం. రామచంద్రుని పేట తెలంగాణకు ప్రాంతానికి సరిహద్దుగా ఉండటం వలన అవకాశాన్ని అదునుగా చేసుకున్న అక్రమార్కుడు రాత్రి పగలు అనే తేడా లేకుండా నిత్యం భారీ యంత్రాలతో తవ్వకాలు జరుపుతూ భారీ వాహనాల ద్వారా ఆంధ్ర తెలంగాణ ప్రాంతాలకు అక్రమ మైనింగ్ (గ్రావెల్) ను సరఫరా చేస్తూ కోట్ల రూపాయలు కూడబెట్టినట్లుగా తెలుస్తుంది. అధికారం రాగానే మొదలు పెట్టిన అక్రమ మైనింగ్(గ్రావెల్) త్రవ్వకం నేటికీ ఆ అక్రమ మైనింగ్ రవాణా మూడు పువ్వుల ఆరు కాయలు గా విరజిల్లుతుంది. కొండలను పిండి చేసి అక్రమ మైనింగ్ ( గ్రావెల్) రవాణాకు బిగ్ బాస్ గా దీపక్ పేరు బాగా వినిపిస్తుంది. ఈ విధంగా రామచంద్రుని పేట గ్రామ నలుమూలల భారీ యంత్రాలతో త్రవ్వకాలు జరుగుతూ భారీ వాహనాల ద్వారా తెలంగాణ ప్రాంతానికి అక్రమ రవాణా చేస్తూ జేబులు నింపుకోవడం జరుగుతుంది. ఈ విధంగా పకృతి వనరులను ధ్వంసం చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ కోట్ల రూపాయలు అక్రమార్జనకు పాల్పడుతున్న అక్రమార్కుడు పై విచారణ జరిపించాలని కోరుతున్నారు. అలాగే ఈ అక్రమ మైనింగ్ త్రవ్వకాలపై స్థానిక రెవెన్యూ పోలీస్ మైనింగ్ శాఖల అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందించకపోవడం వెనుక అంతర్యం ఏమిటో ఉన్నతాధికారులకే ఎరుక. ఈ మైనింగ్ తవ్వకాలపై స్థానికులు విజిలెన్స్ అధికారులకు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది. ఈ విధంగా అక్రమార్కుడు అధికారాన్ని అడ్డం పెట్టుకొని స్థానిక అధికారులను ప్రలోభాలకు గురి చేసి అక్రమార్చనకు పాల్పడుతున్న అక్రమార్కుడు పై జిల్లా ఉన్నతాధికారులు విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# సృజన ఫౌండేషన్ 8వ బ్యాచ్ కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కేంద్రం ప్రారంభం






**నందిగామ, ఆగస్టు 7, మేజర్ న్యూస్:** పట్టణంలోని చైతన్య కాలేజ్ సమీపంలో సృజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 8వ బ్యాచ్ కుట్టు మిషన్ ఉచిత శిక్షణ కేంద్రం గురువారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,శాసనసభ్యులు తంగిరాల సౌమ్య, కూటమి నాయకులతో కలిసి శుభారంభం చేశారు. ఈ సందర్భంగా సృజన ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు, సమాజంలో వారు చేస్తున్న సామాజిక సేవల గురించి సౌమ్య విశేషంగా ప్రశంసించారు.సృజన ఫౌండేషన్ గత కొన్నేళ్లుగా నిరంతరం సమాజంలోని నిరుపేద, అవకాశాలు లేని వర్గాలకు చెందిన మహిళల సాధికారత కోసం కృషి చేస్తోంది. కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ద్వారా మహిళలకు ఉచితంగా కుట్టు, టైలరింగ్ శిక్షణ అందించడం ద్వారా వారిని ఆర్థికంగా స్వావలంబనగా తీర్చిదిద్దడం ఈ సంస్థ లక్ష్యం. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు వందలాది మహిళలు శిక్షణ పొంది, స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకున్నారు.ప్రారంభోత్సవంలో తంగిరాల సౌమ్య మాట్లాడుతూ"సృజన ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవలు అభినందనీయం. మహిళలకు నైపుణ్య శిక్షణ అందించడం ద్వారా వారి జీవనోపాధికి బాటలు వేయడం ఈ సంస్థ యొక్క గొప్పతనం. ఈ కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం మహిళలకు కేవలం నైపుణ్యం మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసాన్ని, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కూడా అందిస్తుంది," అని అన్నారు. ఈ కార్యక్రమం సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు స్వావలంబన దిశగా ఒక మహత్తరమైన అడుగు అని ఆమె పేర్కొన్నారు. సృజన ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ 8వ బ్యాచ్‌లో శిక్షణ పొందే మహిళలకు ఆధునిక కుట్టు యంత్రాలు, డిజైనింగ్ టెక్నిక్‌లు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్‌లతో పాటు, స్వయం ఉపాధి కోసం అవసరమైన మార్గదర్శనం, సహాయం కూడా అందించనున్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, స్థానిక కూటమి నాయకులు, సృజన ఫౌండేషన్ సభ్యులు, శిక్షణ పొందే మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సృజన ఫౌండేషన్ యొక్క ఈ సేవా కార్యక్రమం నందిగామ పట్టణంలో మహిళా సాధికారతకు ఒక కొత్త అధ్యాయాన్ని రాస్తుందని అందరూ ఆశాభావం వ్యక్తం చేశారు.

# లింగాల కాజ్ వే పునర్నిర్మాణం పూర్తయింది



**వత్సవాయి: ఆగస్టు 7 మేజర్ న్యూస్:** ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానించే ప్రధాన మార్గమైన ఈ లింగాల కాజ్ వే, గత ఏడాది సెప్టెంబరు నెలలో మున్నేరు నదికి వచ్చిన భారీ వరదల ధాటికి పూర్తిగా దెబ్బతింది. దీంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది. సిమెంట్ ముడిసరుకు రవాణా, గ్రామాల ప్రజల రాకపోకలు తీవ్రంగా నిలిచిపోయాయి.ఈ పరిస్థితిని గమనించిన తాతయ్య తాత్కాలిక మరమ్మతులతో పాటు, శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నించారు. సిమెంట్ కంపెనీల సహకారంతో తాత్కాలికంగా రహదారి మళ్లీ అందుబాటులోకి తీసుకువచ్చారు. కానీ అది కూడా కొంతకాలంలో పాడైపోవడంతో, తాత్కాలికం కంటే శాశ్వతమే అవసరమని నిర్ణయించారు.వెంటనే ఆర్ అండ్ బి అధికారులతో చర్చలు జరిపి, ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు మంజూరు చేయించారు. గుత్తేదారు జూన్‌లో పనులు ప్రారంభించి, జూలై నాటికి 80 శాతం పనులు పూర్తిచేశారు. ఇటీవలే చేపట్టిన స్లాబు కల్వర్టుల నిర్మాణం కూడా 100% పూర్తవడంతో, వాహనాల రాకపోకలకు మార్గం పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గురువారం లాంచనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ, "ప్రజల అవసరాలకు తగిన సమయానికి స్పందించడమే నా కర్తవ్యం. లింగాల కాజ్ వే పూర్తయింది అంటే, అది ఓ అభివృద్ధి కాదు ం ప్రజల జీవన ప్రవాహానికి మళ్లీ ఊపిరి పెట్టినదే." అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు జొన్నలగడ్డ రాధాకృష్ణమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు, తొండపు జగన్మోహన్రావు, లింగాల సర్పంచ్ చల్ల విజయ కుమారి, ఎంపీటీసీ వేముల శివ, మల్లెల శివప్రసాద్, పెద్ది రామారావు, యానాల గోపీచంద్, చిట్టూరి రమేష్, చావ నాగేశ్వరరావు, చిట్టూరి సుభాష్, మన్నె నారాయణ రావు, ఆవుల రామారావు, కిలారు సూర్యనారాయణ, కర్నాటి రఘు, మొల కృష్ణారావు, ఏపూరి నాగ శ్రీను, బూదాటి రామిరెడ్డి, కర్నాటి వెంకట్రావు, మార్కపుడి నాగేశ్వరరావు, పెంటేల శ్రీను, బొల్లం పురుషోత్తం, జిల్లేపల్లి సుధీర్ బాబు, మార్కపుడి వంశీ, ఆదిమల్ల రమేష్, సాగర్ల, చెన్నా బాలకృష్ణ, ఉప్పుగండ్ల మాధవరావు, మేడేపల్లి ఫ్రాన్సిస్, తోట కృష్ణ, మునగాల వంశీ, పిట్ల సాంబశివరావు, అల్లిక కోటేశ్వరరావు, ఆర్ అండ్ బి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వారసత్వానికి చిహ్నంగా చేనేత పరిశ్రమ




పెడన,మేజర్ న్యూస్ : తమ పూర్వీకుల నుండి వారసత్వముగా చేనేత పరిశ్రమను చేనేత కార్మికులు కొనసాగిస్తూనే ఉంటారని ఎంతో నైపుణ్యం గల చేనేత పరిశ్రమను కూటమి ప్రభుత్వం కాపాడుకుంటుందని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సర్వోదయ చేనేత సహకార సంఘం నుండి బస్టాండ్ సెంటర్ వద్ద గల మహాత్మా గాంధీ విగ్రహం వరకు చేనేత కార్మికుల చే చేనేత దినోత్సరా లేని నిర్వహించారు అనంతరం అధికారులు పోలవరం పేటలో సమావేశం మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత మాట్లాడుతూ చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. దేశ సామాజిక, ఆర్థిక అభివృద్ధికి చేనేత పరిశ్రమ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జూలై 7, 2015లో ఆగస్టు 7వ తేదీని జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించింది అని తెలిపారు. చేనేత రంగం దేశ అద్భుతమైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా, దేశంలో ఒక ముఖ్యమైన జీవనోపాధి వనరుగా ఉన్నదని చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులలో 70% మంది మహిళలే కాబట్టి మహిళా సాధికారతకు ఈ రంగం ఎంతో కీలకం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిశ్రమ అభివృద్ధికి తీసుకోవల్సిన చర్యలపై దృష్టి పెట్టిందని అందులో భాగంగానే చేనేత కార్మికుల కుటుంబాలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్తు ని అలాగే త్రిఫ్ట్ ఫండ్ బకాయిలు రూ.5 కోట్లను నేడు విడుదల చేయనున్నదని వెల్లడించారు.చేనేత ఉత్పత్తులపై విధించిన జీఎస్టీ వలన మార్కెటినింగ్ కి ఇబ్బందిగా మారిందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో దాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించే విధంగా నిర్ణయం తీసుకుంటామన్నారు.చేనేత సంప్రదాయాన్ని ప్రోత్సహించడం ద్వారా పరిశ్రమ అభివృద్ధి చేయడం, కాపాడటం లక్ష్యంగా చేనేత యువ నేత కార్మికుల ప్రతిభను, పనితనాన్ని గుర్తించి వారికి శిక్షణ ఇచ్చి ఇతరులు వారిని ఆదర్శంగా అనుకరించేలా చేయాలనేది ప్రభుత్వం ఆలోచన అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు మున్సిపల్ కమిషనర్ ఎల్ చంద్రశేఖర్ రెడ్డి, తాసిల్దార్ కే అనిల్ కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, చేనేత శ్రామికులు, తదితరులు పాల్గొన్నారు.

## వేణు కుటుంబ సభ్యులను పరామర్శించిన విక్కుర్తి



అవనిగడ్డ మేజర్ న్యూస్ : చిన్న వయసులోనే అనారోగ్య కారణాల తో యువకుడు నందూరి నాగ వేణు మరణించడం విచారకర మని పారిశ్రామికవేత్త విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు విచారం వ్యక్తం చేశారు. పరిధిలోని కొత్త పేట గ్రామానికి చెందిన నందూరి వేణు ఇటీవల అనారోగ్య కారణాలతో ఆకస్మికంగా మరణించారు. విషయం తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ గురువారం ఉదయం కొత్తపేటలోని గృహంలో వేణు తండ్రి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సాను భూతిని తెలియజేశారు. విక్కుర్తి రాంబాబు,న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ, పులిగడ్డ చంద్ర, రేపల్లె మునలయ్య, బర్మా బుజ్జి, రేపల్లె ఈశ్వరరావు, రేపల్లె మధు,బర్మా శ్రీనివాసరావు, బొప్పన రమణ, రాజా, హరి కిరణ్ తదితరులు వేణు కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## ముగిసిన తల్లిపాల వారోత్సవాలు



అవనిగడ్డ, మేజర్ న్యూస్: అవనిగడ్డ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గత వారం రోజు లుగా నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా సిడిపిఓ పి. శేషు కుమారి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శేషు కుమారి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని, జననానంతరం తల్లిపాలే శిశువుకు పూర్తి పోషణని స్తాయని తెలిపారు. తల్లిపాలు బిడ్డకు శక్తి, ఆరోగ్యాలను మెరుగుపరుస్తాయని నినాదాలు చేస్తూ వీధులలో ర్యాలీ నిర్వహించారు.. ప్రతి తల్లి తల్లిపాలను తప్పనిసరిగా తన బిడ్డకు ఇవ్వాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రత్నమాల, ప్రాజెక్ట్ ఏరియా కార్యదర్శి ఏ. నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తల్లిపాలను ప్రోత్సహించడంలో భాగంగా వీరి చొరవ ప్రశంసనీయమని స్థానికులు అభినందించారు.

## బాధితులకు సాయం బాధలు మాయం.



జి.కొండూరు మేజర్ న్యూస్ : అనారోగ్యం బారిన పడినా.. ప్రమాదాల్లో గాయపడినా.. ఆసు పత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించు కునేందుకు ఆర్థిక స్తోమతలేని ఎందరికో ముఖ్య మంత్రి సహాయ నిధి ఆపన్నహస్తంలా మారింది. బాధితుల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు ప్రత్యేక చొరవ తీసుకుని పేదలకు సాయం అందిస్తున్నారు. తాజాగా విజయవాడ రూరల్ మండలంలోని జక్కంపూడికి చెందిన ముసుకు జ్యోతికి రూ.50 వేలు ఎల్.ఓ.సి, రెడ్డిగూడెం మండలం నాగులూరు గ్రామానికి చెందిన మిక్కిలి కాంతాశ్రీకి రూ.2 లక్షల ఎల్.ఓ.సి, జి.కొండూరు మండలంలోని చెవుటూరు గ్రామానికి చెందిన కాటంనేని మహాలక్ష్మికి రూ.70 వేల చెక్కు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరయ్యాయి. వీరికి ఎల్వో సీలను, చెక్కులను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గొల్లపూడిలోని శాసనసభ్యులు వారి కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ ఆర్థికసాయం సద్వినియోగం చేసుకుని వారి ఆరోగ్యంగా సురక్షితంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి నేతలు పాల్గొన్నారు.

## పచ్చిగోళ్ల వారి పెళ్లిసందడిలో శాసనసభ్యులు కృష్ణప్రసాదు



జి.కొండూరు మేజర్ న్యూస్ : పచ్చిగోళ్ల వారి పెళ్లి సందడిలో మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు పాల్గొన్నారు.జి.కొండూరు మం డలం వెల్లటూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పచ్చిగోళ్ల బాలకృష్ణ సోదరుడు విజయ్ వివాహం వెల్లటూరులోని వారి నివా సంలో గురువారం జరిగింది. ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్న మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణప్రసాదు నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు

## ఉత్సాహంగా ముగిసిన జిల్లా స్థాయి షటిల్ బాడ్మింటన్ ఎంపికలు

గన్నవరం, ఆగస్టు 7, మేజర్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం గన్నవరం కే.వి.ఆర్ ఇండోర్ స్టేడియంలో అండర్-19 బాలురు, బాలికల షటిల్ బాడ్మింటన్ ఎంపికలు ఉత్సాహంగా నిర్వహించాయి. ఈ ఎంపిక పోటీ లకు జిల్లా నలుమూలల నుండి పోటీపడేందుకు బాలబాలికలు భారీగా హాజర య్యారు. తమ ఆటతీరుతో మెప్పించిన ప్రతిభావంతులైన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేసినట్టు కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారిణి కే. ఝాన్సీ లక్ష్మి తెలిపారు. ఈ పోటీలను కే.వి.ఆర్ కిషోర్ పర్యవేక్షించారు. ఎంపి క కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయులు రామారావు, బాల కృష్ణ, చంద్రశేఖర్, నాగరాజు, శాంతి కిరణ్, రాంబాబు సహకరించారు. ఎంపి కైన అండర్-19 బాలుర జట్టు సభ్యులు...పి. ఆరిఫ్ (మచిలీపట్నం), జి. విజయ్ (గుడివాడ), జి. శ్యామ్ సుదీప్ (ఉంగుటూరు), పి. నరసింహ (జెడ్పీ హైస్కూల్, గన్నవరం), వి.యస్. చరితేష్ (హనుమాన్ జంక్షన్), వి. శ్రీకర్ (జెడ్పీ హైస్కూల్, గన్నవరం), ఎంపికైన అండర్-19 బాలికల జట్టు సభ్యులు జి. గౌరీ



స్వాతిక (గుడ్లవల్లేరు), జి.బిందు శ్రీ (గుడ్లవల్లేరు), సి.హెచ్. స్వప్న కుమారి (వీరవనేనిగూడెం), యస్.కె. జాస్మిన్ (వీరవనేనిగూడెం), వి. సుకన్య (జెడ్పీ గర్ల్స్ హైస్కూల్, గన్నవరం), పి.అమృత (గన్నవరం), కే. శిరీష (గన్న వరం) ఎంపికైన ఈ జట్లు త్వరలో జరగబోయే జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాయని అధికారులు తెలిపారు.

## వినియోగదారులను ఆకట్టుకుంటున్న సామ్‌సంగ్ కొత్త ఫోల్డబుల్స్



విజయవాడ మేజర్ న్యూస్ : సామ్ సంగ్ ఏడవ తరం ఫోల్డబుల్ స్మార్ట్‌ఫో న్‌లు గెలాక్సీ జెడ్ ఫోల్డ్7, జెడ్ ఫ్లిప్7, జెడ్ ఫ్లిప్7 ఎఫ్ఈ భారతదేశంలో అపూర్వమైన ఆదరణను పొందాయి. ఎంపిక చేసిన మార్కెట్లలో పూర్తిగా స్టాక్ కూడా అయిపోయింది అని కంపెనీ తెలిపింది. జూలై 9న ఈ ఫోన్లను విడుదల చేసిన తరువాత మొదటి 48 గంటల్లోనే 2.1 లక్షలకు పైగా ప్రీ-ఆర్డర్‌లను సామ్‌సంగ్ అందుకుంది. అద్భుతమైన అమ్మకాల నేపథ్యంలో, అపూర్వ అవకాశాలు కలిగిన కీలకమైన వ్యూహాత్మక మార్కెట్ గా భారతదేశం నిలుస్తుందని సామ్‌సంగ్ సౌత్‌వెస్ట్ ఆసియా ప్రెసిడెంట్, సీఈఓ జెబి పార్క్ అన్నారు.

## పెసర, మినుము పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు




కంచికచర్ల ఆగస్టు 7 మేజర్ న్యూస్ : డాక్టర్ కే ఎల్ రావు కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం గరికపాడు శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్, వ్యవసాయ అధికారి కంచి కచర్ల ఆధ్వర్యంలో గురువారం కంచికచర్ల, పెరకలపాడు గ్రామాలలో పెసర, మినుము పంటలను పరిశీలించారు. రైతులు ఈ ప్రాంతంలో 6500 ఎకరాలలో పెసర, మినుము సాగు చేశారు. పంట కాయ ముదిరే దశలో పంటాకు,పల్లాకు ఉంది. పంటాకు, పల్లాకు తెగులు వైఎంవీ ఆశించడం వలన దాదాపు 30 శాతం వరకు కాయలు తెల్లగా మారి విత్తనం సరిగా ఏర్పడలేదు. పాక్షికంగా గింజ కట్టిన కాయలు కూడా పక్వానికి రావడం ఆలస్యం అవుతుంది. ఫలితంగా ఆరోగ్యంగా పక్వదశకు చేరిన కాయలను యంత్రం ద్వారా కోయడానికి అనుకూలించడం లేదు.రైతు సోదరులు ఈ దశలో తెల్ల దోమ నివారణకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయడం వలన ప్రయోజనం ఉండదని రైతులకు తెలియ జేశారు.గత నెలలో ఏర్పడిన బెట్ట వాతావరణం వలన రసం పీల్చే పురుగు అధిక సంఖ్యలో అభివృద్ధి చెంది తెగులు వ్యాప్తికి దోహద పడింది. కాబట్టి రైతు సోదరులు రాబోయే రోజులలో ఈ తెగులును తట్టుకునే రకాలను విత్తుకోవాలని సూచించారు. ఈ ప్రయోజనం కోసం వచ్చే సంవత్సరానికి పల్లాకు తెగులు తట్టుకునే పెసర పంట రకాలు ఎల్జీజీ 607, ఎల్జీజీ 630, డబ్ల్యుజిజి 42 సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఎస్ అధిపతి కృష్ణంరాజు. కెవికె అధిపతి అచ్యుత రాజు, శాస్త్రవేత్త శివ ప్రసాద్, డి.వెంకటేశ్వర్‌రావు, డిడిఎ శ్రీనివాసరావు,వ్యవసాయ సహాయ సంచాలకులు, ఎ.ఓ. విజయ్, గ్రామ వ్యవసాయ సహాయకులు రఘు, మస్తాన్, రైతులు పాల్గొన్నారు.

## కోడూరు ఎస్సై కే చాణిక్య వాహనాల తనిఖీ



కోడూరు మేజర్ న్యూస్: కోడూరు అవనిగడ్డ ప్రధాన రహదారి కృష్ణాపురం కోడలిలో వాహనాలు తనిఖీలు చేస్తున్న కోడూరు ఎస్సై కే చాణిక్య. ద్విచక్ర వాహనాలకు ఆటోలకు సరైన పత్రాలు లేకపోతే ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు చూపి చకపోతే కఠినంగా శిక్షిస్తామని ఎస్ ఐ కే చాణక్య హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎస్సై కే చాణిక్యతో పాటు ట్రైనింగ్ ఎస్సై కూడా పాల్గొనడం జరిగింది వీరితోపాటు స్టేషన్ సిబ్బంది కూడా ఉన్నారు..

## గమనిక

నాపేరు Tammisetti Srilekha నేను. D/no-32-213, Near Govt hospital, Khilla road Kondapalliనందు నివసించుచున్నాను. నా ఆధార్లో ఇంటిపేరు ఒక అక్షరం తప్పు పడినది. కావున నా 10 వ తరగతి సర్టిఫికెట్లో ఉన్నట్లుగా మార్చవలసినదిగా కోరుతున్నాను. Tammisetty Srilekha అని ఉన్న పేరును Tammisetti Srilekhaగా మార్చవలసినదిగా కోరుతున్నాను. గజిట్ నోటిఫికేషన్ కోసము.

నా పేరు
**T. Srilekha**
Phno:8309039718



## అవనిగడ్డలో ఘనంగా పొన్నమండ జన్మదిన వేడుకలు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అగ్నికుల క్షత్రియ జాతిపిత పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ 156వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక 4వ వార్డులోని అగ్నికుల క్షత్రియ కమ్యూనిటీ హాల్లో అగ్నికులక్షత్రియ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో లక్ష్మణ స్వామి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా అగ్నికుల క్షత్రియ జాతీయ గౌరవ సలహాదారులు లంకే యుగంధర్ మాట్లాడుతూ, పొన్నమండ లక్ష్మణస్వామి మా వంశమునకు ప్రత్యేక చరిత్ర ఉందని, ఆయన దేశ నలుమూలలలో తిరిగి బ్రిటిష్ మద్రాస్ గవర్నమెంట్ ముందు ఆధారాలతో చరిత్రను వివరించి, అగ్ని హోమం నుండి ఈ వంశం ఏర్పడిందని సాక్ష్య పద్దరని తెలిపారు. తెలుగు ప్రాంతాలలో అగ్నికులక్షత్రియుల పేరును, తమిళ ప్రాంతాలలో వహ్నికుల క్షత్రియులు అని పిలవాల్సిన అవసరం కోసం పోరాడి 1929 జూన్ 13న జీవో నం. 271 జారీ చేయించి తమ ప్రత్యేకతను గుర్తింపు పొందించుకున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నికులక్షత్రియ యూత్ ఫోర్స్ రాష్ట్ర మీడియా విభాగం అధికార ప్రతినిధి వడుగు నాగార్జున, అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు నాయుడు వెంకటకృష్ణ, కోలా బాలాజీ, లకనం నాగఅంజనేయులు, కొక్కిలిగడ్డ నాంచారయ్య, కర్రి కృష్ణమూర్తి, కొల్లు నాగబాబు, మచ్చా వెంకటేశ్వరావు, నడకుదిటి శ్రీనివాసరావు, సైకం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కౌతరం అంగన్వాడీల్లో తల్లిపాల వారోత్సవాలు



**గుడ్లవల్లేరు ఆగస్టు 7 మేజర్ న్యూస్:** తల్లిపాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా గుడివాడ ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు మండలం కౌతవరం సెక్టారు పరిధిలోని కౌతవరం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు గురువారం నిర్వహించడం జరిగింది. ఐసిడిఎస్ సూపర్వైజర్ డి.మేరీ హాజరై గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కౌతవరం గ్రామ అంగన్వాడీ కార్యకర్తలు, కేర్ టు యాక్షన్ సంస్థ కోఆర్డినేటర్ కీర్తన, గర్భవతులు, బాలింతలు పాల్గొనడం జరిగింది.

## త్రిసభ్య కమిటీ చైర్మన్లను ఎమ్మెల్యే అభినందనలు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని చెవుటూరు పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్గా నియమించబడిన ఈమని మురళీకృష్ణ ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గా నియమించబడిన యేడులూరి వెంకటశివ మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ని గురువారం గొల్లపూడిలోని శాసనసభ్యుని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వారిని శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు విశేష సేవలందించాలని ఆయనకు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు సూచించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి లోకేష్‌కు పలు సమస్యలపై ఎమ్మెల్యే వసంత విజ్ఞప్తి





**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యా మంత్రి నారా లోకేష్ కు మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా మైలవరం నియోజకవర్గంలో పలు సమస్యలపై మంత్రి లోకేష్ కు విజ్ఞప్తి చేశారు.జి.కొండూరు మండలంలోని హావేలి ముత్యాలంపాడు – కందులపాడు గ్రామాల మధ్య బుడమేరుపై ఉన్న వంతెన గతంలో సంభవించిన వరదలకు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, కాలక్రమంలో కూలిపోయిందన్నారు.ఆ వంతెనకు ప్రత్యామ్నాయంగా దాని పక్కనే బుడమేరుపై ఏర్పాటు చేసిన తాత్కాలిక లో లెవల్ వంతెన కూడా వరదల వల్ల పలుమార్లు కోతలకు గురై, భారీ వాహనాల తాకిడికి గుంటలు ఏర్పడి రాకపోకలకు చాలా ఇబ్బందిగా ఉందన్నారు.ఇక్కడ నూతన హై లెవల్ వంతెన నిర్మాణానికి తక్షణమే అత్యవసర ప్రాతిపదికన రూ.10 కోట్లుమంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండగ విజయవాడ–విస్సన్నపేట ప్రధాన రోడ్డు కూడా విస్తరణతో కూడిన రహదారి అభివృద్ధికి కూడా రూ.66 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులతో 43.45 కిలోమీటర్ల మేర రహదారి అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ రహదారి కూడా గోతులు ఏర్పడి, చాలా చోట్ల ధ్వంసమై చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. వాటికి సంబంధించిన చిత్రాలను చూపుతూ మంత్రి లోకేష్ కు సమస్య తీవ్రతను వివరించారు. ప్రజలు, వాహన చోదకులు, ప్రయాణికులు అవస్థలు తెలిపారు.అలానే మైలవరం నియోజకవర్గంలో వివిధ సమస్యల గురించి, పలు రహదారుల అభివృద్ధి, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి మంత్రి నారా లోకేష్ తో ప్రస్తావించారు. పలు సమస్యలను వెంటనే యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, తక్షణమే నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చెప్పిన విషయాలపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వెల్లడించారు.



## పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్లను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు అభినందనలు

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని కవులూరు పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్గా నియమించబడిన చెరుకూరి గంగాధరరావు, వెలగలేరు పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్గా నియమించబడిన మంచినేని రాజశేఖర్ ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గా నియమించబడిన చెరుకూరి రామకృష్ణ విజయవాడ రూరల్ మండలంలోని పైదూరుపాడు పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గా నియమించబడిన దాసన నాగవదనరావు మైలవరం మండలం పుల్లూరు పి.ఏ.సి.ఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ గా నియమించబడిన వజ్రాల సురేష్ రెడ్డి మైలవరం శాసన సభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు ని గురువారం గొల్లపూడిలోని శాసన సభ్యుని వారి కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదు వారిని శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి, అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యాల మేరకు రైతులకు విశేష సేవలందించాలని ఆయనకు ఎమ్మెల్యే కృష్ణప్రసాదు సూచించారు. ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం నూతన ఎంఈఓ మాలనికి సన్మానం



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మండలంలోని నూతన ఎంఈఓ టుగా నియామకమైన టీవీ మాలినిని ఇబ్రహీంపట్నంలోని ఎంఈఓ కార్యాలయంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయుల యూనియన్ ఆధ్వర్యంలో ఆమెను శాలువాతో పుష్పగుచ్ఛి తో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీవీ మాలిని ఉపాధ్యాయుల పట్ల ఎంతో అంకితభావంతో పని చేస్తూ ఇటీవల కొటికలపూడి గ్రామం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా ఇబ్రహీంపట్నం మండల విద్యాశాఖధికారి టు గా నియమించడం పట్ల వారు హర్ష వ్యక్తం చేశారు.మండల విద్యాధికారిగా పేద బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అందుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో వల్లెపు నరేంద్ర, వెంకటేశ్వరరావు, మనోజ్, శ్రీనివాసరావు, మునీర్, సారధి, తదితరులు పాల్గొన్నారు.

# దివి సీమ ప్రాంత రైతులకు నీటి కష్టాలు



**నాగాయలంక ఆగస్టు/7 మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలంలో నారు మళ్ళు సిద్దమైన నాట్లు వేసేందుకు నీరు లేదు. నాగాయలంక దిగువ తలగడ దివి, గణపేశ్వరం, భర్రెంకుల, నాలి,దిగువ కాలవల క్రింద నారుమడులు, సిద్ధమయ్యాయి గాని నాట్లు వేసేందుకు నీరు లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏటా నాట్లు వేసిన రైతులు నీరు అందక మడులు ఎండిపోతు న్నాయని రైతులు ఆవేదన వ్యక్తపరచుచున్నారు,ఆఖరికి నారుమడుల్లో కూడా వీరు లేకుండా మడులు ఎండిపోతున్న అని రైతులు ఆవేదన చెందుతున్నారు.తమకు రావలసిన నీరు రాకుండా ఇతర కాలవలకు మళ్లించి ఇస్తున్నారు అంటూ కూడా విమర్శలు చేస్తున్నారు. దివి సీమ ప్రాంతమైన పెద్దపాలెం,ఏటిమెగ చిన్న కమ్మ వారిపాలెం,పెద్ద కమ్మ వారిపాలెం, గుల్లలమోత, ప్రాంతాల లోని రైతులకు సక్రమంగా నీరు అందక ఇంజన్ల ద్వారా నీటిని నారు మడు లకు తోడు కొను చున్నారు. ఈ విషయము పైన నీటి పారుదల శాఖ అధికారులను,డిసీ కమిటీ నాయకులను, అడిగితే సరైన సమాధానం తెలియ పరచుటలేదు. గతంలో ఇటు వంటి ఇబ్బందులు ఎప్పుడూ పడలేదని రైతులు ఆవేదన వ్యక్త పరుచు తున్నారు. ఇప్పటికైనా అధి కారులు సకాలంలో స్పందించి ముురుగునీరు ప్రవహించు మురుగు నీటి కాల్వ లోనికి ప్రధాన కాల్వలో అడుగున గల తూములు పగలు కొట్టి, వేసిన అక్రమ తూములు ) అనధి కార నీటి పంపిణీ చేయుట అరికట్టి పంటనీటి కాలువలు,గ్రామాలలోని మంచినీటి చెఱువులకు వెళ్ళుటకు, సక్రమంగా నీటిని సరఫరా చేసి గ్రామ ప్రాంత ప్రజల దాహార్తిని,రైతుల బాధను తొలగించ వలసిందిగా దివి సీమ ప్రాంత ప్రజలు,వ్యవసాయ దారులు,రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుచున్నారు.

# ఏ పని అయినా ఇష్టంతో చేస్తే కలలు సాకారం








**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల లో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం, ముఖ్య అతిధిగా హాజరైన భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు,పాల్గొన్న కళాశాల చైర్మన్ సుంకర రామబ్రహ్మం, కార్యదర్శి, కరస్పాండెంట్ సుంకర అనిల్, ప్రిన్సిపల్ డా. జివికేఎస్వి ప్రసాద్,వైస్ ప్రెసిడెంట్ లంక అరుణ్,ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు, కళాశాల విద్యార్ధులు, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్ధులకు వెంకయ్య నాయుడు డిగ్రీ సర్టిఫికేట్‌లు అంద చేశారు. ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ కళాశాలలు, యూనివర్శిటీ లకు వెళ్లి ప్రసంగించే కార్యక్రమాలు పెట్టుకున్నాను. నేను పదవీ విరమణ చేశాను కానీ.. పెదవీ విరమణ చేయలేదు. దేశ భవిష్యత్తు గురించి నేటి తరానికి చెప్పాలనేదే నా సంకల్పం, డిగ్రీ పట్టాలు అందుకున్న ఈరోజు జీవితం లో మరచిపోలేని రోజు ప్రపంచంలో నేడు మన దేశం వేగవంతంగా అభివృద్ధి చెందుతుంది.ప్రపంచ ఆర్ధిక అభివృద్ధిలో నాలుగో స్థానంలో ఉన్నాం. త్వరలోనే మూడో స్థానానికి చేరుతాం. కొన్ని అగ్ర దేశాల బెదిరింపులు కు మనం భయపడేది లేదు. మన పంచభూతాలను మనం గౌరవిస్తే. అవి మనల్ని కాపాడతాయి. మన తెలివిని దోచుకుని.. వారి గురించి గొప్పగా బ్రిటిష్ వారు చెప్పుకున్నారు.స్వాతంత్ర్యం వచ్చాక మన తెలివి తేటలతో మనం సొంతంగా ఎదిగాం. 75 యేళ్ల స్వాతంత్ర్య భారతావనిలో మనం అమృత కాలంలో ఉన్నాం.నేటి తరం అంతా మన దేశ అభివృద్ధి లో భాగస్వామ్యం కావాలి.భారతదేశం ఎప్పుడూ ఏదేశం మీద దండయాత్ర చేయలేదు మన మూలాలు దెబ్బ తీయడానికి గతంలో చాలా కుట్రలు చేశారు.మన సంస్కృతిని నిర్వీర్యం చేయాలని చూశారు.అన్నీ తట్టుకుని, నిలదొక్కుకుని నేడు నిలబడ్డాం. నేడు మనకు ఎన్ని అవకాశాలు ఉన్నాయో.అన్ని సవాళ్లు కూడా ఎదురవుతున్నాయి.ప్రతి పాఠశాల,కళాశాలల్లో విద్యార్థులుకు ఐక్యతతో ఉండేలా చూడాలి.కుల, మత, ప్రాంత బేధాలు ఉండకూడదు.16 యేళ్లుగా ఉషారామ ఇంజనీరింగ్ కళాశాలలో మంచి విద్యను బోధిస్తున్నారు. విద్యార్థులు కు సంస్కారం తో ఉండేలా అలవాటు చేయాలివిద్యాలయం, గ్రంధాలయం, సేవాలయం ఉండేలా చూడాలి కన్నతల్లిని, పుట్టిన ఊరుని, పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరువకూడదు.ఎంత ఉన్నత స్థానానికి వెళ్లినా నీ ఊరును మరచిపోకునీ కంటే ఆర్ధికంగా బలహీనంగా ఉన్న వారిని చేతనైనంతలో చేయూత ను ఇవ్వాలిచదువు తోపాటు డిగ్రీ సంపాదించడమే కాదు.. సంస్కారం, విజ్ఞానం సంపాదించడం ముఖ్యంభావి తరాలు ఈ అంశాలను గుర్తు పెట్టుకోండి. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉన్న సవాళ్లను ఎదుర్కొనేలా మీ మేధస్సు తో పని చేయాలిమన దేశంలో ఉన్న యువత ప్రపంచంలో ఎక్కడా లేరుదేశం ముందు, ఆ తరువాత పార్టీ లు, ఆ తరువాత స్వలాభం.నేడు ఇందుకు రివర్స్ లో ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇటువంటి అంశాలు మన దేశానికి మంచిది కావుఇంజనీర్లు అందరూ మీ శ్రమ, పట్టుదల, మేధస్సు తో మంచి ఫలితాలు సాధించాలి.ఏ పని అయినా కష్టంతో కాదు ఇష్టంతో చేస్తే.కలలు సాకారం అవుతాయి.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అందుబాటులో కి వస్తుందివాటిపై మనం పూర్తి అవగాహన పెంచుకోవాలిమన సాంకేతికత ను ఉపయోగించి మంచి పంటలు పండేలా చేయాలి.రైతు నేడు చాలా నష్టపోతున్నాడు.. ఇంజనీర్లు వ్యవసాయ రంగం పై దృష్టి పెట్టాలి.మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం కనుగొనే దిశగా మన పని తీరు ఉండాలి.ఉషారామ విద్యార్థులు అంటే ఎక్కడికి వెళ్లినా గొప్పగా చెప్పుకోవాలి,ఎవరికి వారు సొంతంగా కాళ్లపై నిలబడేలా చిన్న పరిశ్రమ లు అయినా నెలకొల్పండి. కేవలం ఉద్యోగం కోసమే అన్వేషిస్తూ ఆగిపోకండిసూర్యోదయానికి ముందే మంచం దిగడం అలవాటు గా మార్చుకోండి.సెల్ ఫోన్ ఎక్కువగా వాడితే. మన మైండ్ సెల్ లోకి వెళ్లి నట్లే,పిల్లలు సృజనాత్మక శక్తి తో పనిచేయడం మానేశారుఆలోచన శక్తి అనేది లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది.ఇప్పుడు ఏది అడిగినా గూగుల్ అంటున్నారు..మాతృభాష లోనే విద్య ఉండాలని మోడి నిర్ణయం తీసుకున్నారు.మాతృభాషలో ఉన్న మధురత్వం ఎందులోనూ లేదు,మన తెలుగు వారంతా తెలుగు భాషలోనే మాట్లాడండి.గుడ్ మార్నింగ్ లు వద్దు నమస్కారం.మన సంస్కారంఫస్ట్ మదర్ టంగ్, తరువాత బ్రదర్ టంగ్, మూడోది ఆంగ్ల భాష,రాంనాథ్ కోవింద్ హిందీ లోచదివారు,వెంకయ్య నాయుడు తెలుగులో చదివారు,సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి యన్. వి.రమణ తెలుగులో చదివే ఎదిగారు.ఏ భాషలో చదివాం అని కాదు.విషయ పరిజ్ఞానం పెంచుకుని ఇక్కడ వరకు వచ్చాం.నేటి తరం కూడా మీ పని తీరు, పరిజ్ఞానం, కష్టపడటం పై దృష్టి పెట్టండి.ఏ భాష ను బలవంతంగా రుద్దకూడదు.. ఏ భాషను మనం వ్యతిరేకించకూడదు ప్రతి రోజూ నడక, వ్యాయామం, యోగా చేయడం ముఖ్యంపిజ్జాలు, బర్గర్లు తినడం ద్వారా ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు.మన సంప్రదాయ భోజనం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.మన ఇడ్లీ, మన దోశ, మనసాంబారు, గుంటూరు కారం ప్రపంచంలో ఫేమస్ అయ్యాయి.మన ఆహారపు అలవాట్లు వదలకుండా అమలు చేయండి.మోడీ ప్రవేశ పెట్టిన యోగా170 దేశాలు అమలు చేస్తున్నాయి.యోగా మోడీ కోసం కాదు.మన బాడీ కోసం అనేది తెలుసుకోండి.మన తల్లిదండ్రులు ను గౌరవించండి.. బామ్మ, తాతయ్య లతో కాసేపు గడపండి.నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయకండి.. ఆక్రమణ లు నిరోధించండి.మొన్న బుడమేరు ముంపు తరువాత అయినా పాఠాలు నేర్చుకోండి.ప్రతి ఒక్కరూ మనం ఎక్కడి నుంచి వచ్చామనేది మరచిపోకండి. మన తెలుగు భాషా వైభవం, మన సంస్కృతిని చాటి చెప్పండి.

# ఆరోగ్యమే మహాభాగ్యం.. వ్యాయామమే దానికి మూలం






**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ ఆగస్టు 07 :** స్థానిక శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో ఫస్ట్ బీటెక్ విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహిస్తున్న జీరో సెమిస్టర్ కార్యక్రమంలో భాగంగా యోగివేమన యూనివర్సిటీ, కడప స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ డాక్టర్ కె. రామసుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా, వక్తగా విచ్చేసి విద్యార్థిని విద్యార్థులకు వ్యాయామ సూత్రాలు నేటి తరం వారికి ఎంత అవసరమో అన్న విషయాలను చక్కటి ఉదాహరణలతో వివరించారు. మానవుడి దైనందిన జీవితంలో వ్యాయామం చాలా అవసరమని 100 సంవత్సరాల జీవితం ఆరోగ్యంగా ఉండటం అదృష్టం అని అందుకు మంచి ఆహార అలవాట్లు, శారీరక మానసిక ధృఢత్వం అవసరమని సూచించారు. శరీరం ధృఢంగా ఉండాలి అంటే శారీరక శ్రమ అవసరమని తెలియజేసినారు. విద్యార్థినీ విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలి అంటే మంచి ఆలోచనలు వినయ విధేయతలు కష్టపడే తత్వం క్రమశిక్షణ సమయపాలన వంటి మంచి లక్షణాలు కలిగి ఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఆధునిక సమాజానికి శారీరక, మానసిక వ్యాయామం చాలా మేలు చేకూరుస్తుంది అని వీటి వలన ఒత్తిడిని తట్టుకుని అనారోగ్య బారిన పడకుండా ఆరోగ్యకరమైన ఆనందకరమైన జీవితాన్ని సాగించవచ్చునని తెలియజేసినారు. ప్రతి మనిషి ప్రతిరోజు 45 నిమిషాలు వ్యాయామం చేయటం తప్పనిసరి అందుకోసం చదువుతో పాటు ఏదో ఒక క్రీడారంగంలో నైపుణ్యంను సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరాలని విద్యార్థిని విద్యార్థులకు తెలియజేసినారు. అనంతరం ముఖ్య అతిథి సుబ్బారెడ్డిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, యాజమాన్య సలహాదారులు డాక్టర్ పి.రవీంద్ర బాబు జ్ఞాపికతో సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి. కోదండ రామారావు, డాక్టర్ ఎం.ఆర్.సి.హెచ్.శాస్త్రి, వివిధ విభాగాధిపతులు ఎస్. ఐ. పి. 2025 కోఆర్డినేటర్స్ డాక్టర్ ఎల్.ఆర్.శ్రీనివాస్ డాక్టర్ ఎస్.సురేష్ ఎన్.ఎస్.ఎస్ ఆఫీసర్ డాక్టర్ వి.నవీన్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ మత్తి శివశంకర్ అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

## ప్రజల చేతిలో పాలన కూటమి ప్రభుత్వంలో మరో మైలురాయి వాట్సాప్ గవర్నెన్స్



### జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** సమస్యలను చెప్పేం దుకు కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు ఒకప్రకటనలో పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ ప్రజలలో విశేష స్పందన తెచ్చుకుందని కూటమి పాలనలో ఇది ఒక మైలురాయని అన్నారు. ప్రజల అరచేతిలోకి ప్రభుత్వసేవలు రావడం ప్రజల వద్దకు పాలన అంటే ఇదే అని గడ్డంరాజు తెలిపారు వివిధ రకాల ప్రభుత్వ సేవలు ఒక మెసేజ్ ద్వారా 9552300009కు వాట్సాప్ ద్వారా తెలియజేస్తే వెంటనే స్పందించి మనకు ఏ విధమైన సేవలు కావాలో తెలియజేసే సమాచారం వస్తుందని తద్వారా మనకు కావలసిన సేవలు పొందడానికి ఆప్షన్ నుఎన్నుకొని ప్రభుత్వం నుండి మనకు కావలసిన సేవలు పొందవచ్చని గడ్డంరాజు తెలిపారు.టెక్నాలజీని ప్రజాసేవకు వేదికగా మలచిన ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు ఈ సమాచారాన్ని ప్రతి ఒక్కరికి చేరేలా ప్రచారం కల్పించాలని పౌరులు సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.

## ఏ ఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్ళకు, హెడ్ కానిస్టేబుళ్లగా పదోన్నతి కల్పిస్తూ గురువారం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు, ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన కానిస్టేబుల్ ఉద్దేశించి ఎస్పీ ఆర్ గంగాధరరావు మాట్లాడుతూ, హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన మీరు, పోలీస్ శాఖలో మరింత నిబద్ధత కలిగి విధులు నిర్వర్తించాలని,పోలీస్ శాఖ యొక్క పేరు ప్రఖ్యాతలు పెంచేలా మీ ప్రవర్తన ఉండాలని తెలియజేస్తూ వారిరువురికి శుభాకాంక్షలు తెలియజేశారు

## చేనేతకు అంతర్జాతీయంగా ప్రత్యేక గుర్తింపు ఉంది

### ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి, గోల్కొండ హస్తకళల అభివృద్ధి సంస్థ ప్రిన్సిపల్ సెక్రెటరీ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి,గోల్కొండ హస్తకళల అభివృద్ధి సంస్థ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్ మాట్లాడుతూ చేనేత కళాకారులు రూపొందించిన నూతన వస్త్రాలను ప్రోత్సహించడానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి చేనేత కళాకారులకు పురస్కారాలు అందించామన్నారు. చేనేత కార్మికులను గుర్తించి పురస్కారాలు అందించడంతో రాష్ట్రవ్యాప్తంగా చేనేత కళాకారులకు ప్రతిష్టాత్మక గుర్తింపు, గౌరవం లభించింది అన్నారు. ముఖ్యంగా భారతదేశ ప్రభుత్వం ద్వారా చేనేత అవార్డు గ్రహీతలకు పెన్షన్ పంపిణీ చేసామని అన్నారు. చేనేత రంగానికి సహాయ సహకారాలు అందించిన వారిని గుర్తించి మంత్రి చేతుల మీదుగా పురస్కారాలు ప్రధానం చేశామని తెలిపారు.చేనేత కార్మికులకు, కళాకారులకు రాష్ట్రస్థాయిలో బతుకమ్మ, ఇన్సూరెన్స్ పలు పథకాలతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. చేనేత కార్మికులు ఎంతో సృజనాత్మకతతో నిర్మల్ జిల్లా ఆర్ట్ కళాకారుల పెయింటింగ్లు, పోచంపల్లి చీరలు, గోల్కొండ మల్టీ క్రాఫ్ట్ చీరలను ప్రారంభించామని, వీటితోపాటు త్రిలింగ చీరలను టెస్కో ఆధ్వర్యంలో ప్రారంభించామని శైలజా రామయ్యర్ అన్నారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడే విధంగా పండగలకు, శుభకార్యాలకు, దేవీ నవరాత్రులకు మహిళలు ధరించే పువ్వులు గల ప్రత్యేక శైలి చీరలను ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో చేనేతలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉందని జాతీయంగా అంతర్జాతీయంగా పేరెన్నిక గన్నా తేలియా చీరలు, రుమాలు,ఇమ్మలు దుస్తులు, పీదాంబరి చీరలు, గొల్లభామ, రామప్ప, ఆర్మూరు ఎంతో పేరుగాంచాయని శైలజా రామయ్యర్ వివరించారు.

# పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం



**పామర్రు ఆగస్టు 7 మేజర్ న్యూస్:** కూటమి ప్రభుత్వం అంటేనే పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు అండగా ఉండే ప్రభుత్వమని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పామర్రు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తోట్లవల్లూరు మండలం చాగంటిపాడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త కుటుంబానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును గురువారం కుమార్ రాజా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ నోటికి హద్దు అదుపు లేకుండా ప్రజలలోకి వెళ్లి విద్వేషాలు రెచ్చగొడుతున్నారని పేర్కొన్నారు. చేతనైతే సహాయం చేయాలి గాని లేనిపోని కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను రెచ్చగొట్టడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. గత ఐదేళ్లలో ప్రజలను పట్టించుకోకుండా గాలికి వదిలేసి తగుదునమ్మా అంటూ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందిస్తుంటే చూసి ఓర్చుకోలేక తెలుగుదేశం పార్టీ వారికే ఇస్తున్నారని ఆరోపణలు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. కొన్ని రోజుల నుంచి గ్రామాలలో తిరుగుతూ ప్రజలను రెచ్చగొడుతూ తెలుగుదేశం పార్టీ వారికే పథకాలు ఇస్తున్నారు వైసీపీ వారికి ఇవ్వటం లేదని మాట్లాడుతున్నారని ఇప్పుడు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి కరుడుగట్టిన వైసీపీ కార్యకర్తలకే మేము డబ్బులు ఇస్తున్నామని అవసరమైతే వారిని వెళ్లి అడిగి తెలుసుకుని బుద్ధి తెచ్చుకోమని ఎద్దేవా చేశారు. చాగంటిపాడు గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కరుడుగట్టిన కార్యకర్త మద్దిరెడ్డి వెంకట్రావు సతీమణి ధనలక్ష్మి ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స చేయించుకోగా ఆమెకు తమ ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి 69,800 రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ చెక్కును గురువారం ఆయన కార్యాలయంలో వెంకట్రావుకు అందజేశారు. కాగా తమ ప్రభుత్వం ఏర్పడిన 13 నెలల కాలంలో ఇప్పటి వరకు దాదాపు 350 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించామని, ఇందులో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు కూడా ఉన్నారని అందరికీ స్వయంగా తాను ఇంటింటికి వెళ్లి చెక్కులు అందించానని ఈ సందర్భంగా కుమార్ రాజా పేర్కొన్నారు. ఈ విషయాలను అనిల్ కుమార్ వారి కార్యకర్తలు, నాయకులను అడిగి తెలుసుకోవచ్చునన్నారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే పథకాలు మంజూరు చేస్తున్నారంటూ అనిల్ కుమార్ గ్రామాల్లో రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం మంచి పద్ధతి కాదని ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని మసులుకోవాలని, లేదంటే ఆ పార్టీ కార్యకర్తలే ఆయనకు తగిన బుద్ధి చెబుతారని కుమార్ రాజా హెచ్చరించారు.

## అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా కూటమిపాలన



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా కూటమి ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని జిల్లా తెలుగుయువత ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇన్ఛార్జి మోర్ల శివ అన్నారు. గురువారం మండల పరిధిలోని యార్లగడ్డ 54, 55వ బూత్ల పరిధిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. టీడీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు అడిగి తెలుసుకున్నారు. రాజధాని నిర్మాణం, పరిశ్రమల ఏర్పాటు, యువతకు ఉద్యోగాల కల్పన, పేదరిక నిర్మూలనకు కృషిచేస్తున్న ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలుతోపాటు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు తొట్టెంపూడి శివపాండురంగారావు, మాజీ సర్పంచ్ బొబ్బా కృష్ణారావు, నీటిసంఘం అధ్యక్షులు తొట్టెంపూడి రాధా కృష్ణ, నేతలు, పెద్దిబోయిన హరినాథ్, శంకర రామకోటేశ్వరరావు, నండూరి శ్రీనివాసరావు, తొట్టెంపూడి పాండురంగారావు, మురాలు రంగారావు, గోపి, కోటేశ్వరరాఎవు, సుబ్బారావు, సతీష్బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వందనకు న్యాయవాదుల సన్మానం



**నందిగామ, ఆగస్టు 7, మేజర్ న్యూస్:** అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జి. వందన ని నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు ఆధ్వర్యంలో బార్ సీనియర్ జూనియర్ న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలసి మేజిస్ట్రేట్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ జాయింట్ సెక్రెటరీ ఉప్పులూరి డేవిడ్ రాజ్, ట్రెజరర్ మాడుగుల స్టాలిన్ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ తాడేపల్లి కాంతారావు, బార్ ఎగ్జిక్యూటివ్ సీనియర్ సభ్యులు చావాలి సాంబశివరావు,16వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ కాట్రా సత్యనారాయణ. మాజీ ఏపీపీ ఈశ్వర ప్రగడ రంగారావు, మాజీ ప్రధాన కార్యదర్శి పెసరమిల్లి సురేష్,మాజీ సంయుక్త కార్యదర్శి ఎక్కిరాల హనుమంతరావు. చెరుకుమల్లి రామారావు, కస్తాల నూతన ప్రసాద్, యరగొర్ల రామారావు, షేక్ దాదా హుస్సేన్, షేక్ సైదా, ఆనంద్ విజయభాస్కర్, మద్దుకూరి శిరీష, మల్లిపాక శ్రీనివాసరావు, పరిటాల ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# చల్లపల్లి ఎన్టీఆర్ పార్కును ఆదర్శంగా నిలుస్తోంది



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** దాతల సహకారంతో ప్రజలకు సౌకర్యవంతంగా చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు ఆదర్శం గా నిలుస్తోందనీ, ఇతర గ్రామాల్లో పార్కుల అభివృద్ధికి చల్లపల్లి ఎన్టీఆర్ పార్కును స్ఫూర్తిగా తీసుకోవాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్టీఆర్ గ్రామపంచాయతీ పార్కులో శ్రీమంతు క్లబ్ ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యం కోసం పారిశ్రామికవేత్త నాయుడు శ్రీధర్(బుజ్జి) రూ. 4లక్షలు, ప్రముకులు నాదెళ్ల పూర్ణచంద్రరావు, వేమూరి కృష్ణారావు, మాలెంపాటి కృష్ణ, పాలడుగు రత్నకుమార్లు లక్ష రూపాయల చొప్పున వితరణతో నూతన ఓపెన్ జిమ్ నిర్మించారు. గురువారం ఉదయం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిధిగా విచ్చేసి జిమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు మాగాణి సమారాధనగా వేలాదిమం దికి స్థలాల పంపిణీకి శ్రీకారంచుట్టిన పుణ్యప్రదేశం ఎన్టీఆర్ పార్కు ప్రదేశమన్నారు. గ్రామాభివృద్ధి, పార్కు అభివృద్ధి, మౌళిక సౌకర్యాల కల్పనలో దాతల పాత్ర ముదావహమనీ, చల్లని మనసున్న వారు చల్లపల్లిలో ఉండటం, మం చిపనికి సహకారం అందించటం గ్రామ ప్రత్యేకత అని అన్నారు. స్వచ్ఛచల్లపల్లి కార్యక్రమం ద్వారా డాక్టర్ డిఆర్కె. ప్రసాద్ – డాక్టర్ పద్మావతి నేతృత్వంలో జరుగుతున్న స్వచ్ఛోద్యమం స్ఫూర్తిదాయకమన్నారు. మొక్కల పరిరక్షణలో అధికారులు కఠినతరంగా వ్యవహరించాలన్నారు. చల్లపల్లి పార్కు ఆదర్శంగా నిలిచేలా సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు. కోనేరు సెంటరులో పోలీసులు లాఠీదెబ్బలు తిని జెండా గౌరవాన్ని



కాపాడిన జెండావీరుడు తోట నరసయ్యనాయుడు వ్యాయామ శిక్షణ ఇచ్చేవారనీ, దండమూడి రాజగోపాలరావు స్ఫూర్తితో కుస్తీ పోటీలపై ఆసక్తితో వివాహం అనంతరం కుస్తీ పోటీలను నేర్చుకుని ఒలింపిక్ విజేతగా, అర్జున అవార్డు పొందిన కామినేని ఈశ్వరరావులు స్ఫూర్తిప్రదాతలన్నారు. మానసిక వికాసాన్ని అందించేందుకు శారీరక వ్యాయామం చేసుకుని ఆరోగ్యవంతులుగా నిలవాలని కోరారు.

శ్రీమంతుక్లబ్ గౌరవ అధ్యక్షుడు వీరమాచినేని భవానీప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో స్వచ్ఛ చల్లపల్లి సారధులు డాక్టర్ డిఆర్ కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి, సీఐ కె.ఈశ్వరరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, శ్రీమంతు క్లబ్ అధ్యక్షుడు నాదెళ్ల వెంకట నరసయ్య, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, డీసీచైర్మన్ నిడమానూరి దిలీప కుమార్, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, తుమ్మల చౌదరిబాబు, మండవ బాలవర్ధిరావు, దాసి సీతారామరాజు, జివి.తాతారావు, ఈవో పివి. మాధవేం ద్రరావులతోపాటు పలువురు ప్రముకులు, వాకర్స్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. దివిసీమ గాంధీ మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు.



## ములపాడు కో-పరేటివ్ సొసైటీ చైర్మెన్‌గా గరికపాటి

**జి.కొండూరు మేజర్ న్యూస్ :** ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు సొసైటీ చైర్మెన్‌గా గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు గరికపాటి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. సీనియర్ నాయకుడికి సొసైటీ చైర్మన్ పదవి లభించడంతో మూలపాడు పార్టీ క్యాడర్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వయంగా రైతు కావడంతో రైతుల సమస్యల పరిష్కారానికి తప్పకుండా న్యాయం జరుగుతుందని గ్రామ రైతులు సైతం ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు. గురువారం నాడు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు గరికపాటి శ్రీనివాసరావు. శ్రీనుకి అభినందనలు తెలిపి రైతులకు అండగా ఉండాలని సూచించారు ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్.తనపై నమ్మకంతో బాధ్యత అప్పజెప్పిన విజయవాడ ఎంపీ కేసినేని శివనాథ్ (చిన్ని)కు, మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కు, స్థానిక నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు శ్రీనివాసరావు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన విక్కుర్తి



**నాగాయలంక మేజర్ న్యూస్ :** నాగాయలంక మండలంలోని బర్రెంకుల గ్రామానికి చెందిన కమతం వెంకట నాంచారయ్య, నాగ లక్ష్మి దంపతుల కుమారుడు బాల సాయికుమార్, బాపట్ల జిల్లా రేపల్లె మండలం పిరాట్లంక వాస్తవ్యులు మొగిలి పువ్వు.రఘు బాబు,శివ పార్వతి దంపతుల కుమార్తె వాణిశ్రీల వివాహం ఈనెల మూడవ తేదీన ఆది వారం రోజున రాత్రి పిరాట్లంక కమతం వారి కళ్యాణ మండపంలో జరిగినది. ఈ రోజు బర్రెంకుల గ్రామం లోని వరుడి స్వగృహంలో సత్య నారాయణ స్వామి వారి వ్రతము నూతన దంపతులు నిర్వహించినారు ఈ కార్య క్రమమునకు ప్రముఖ పారి శ్రామికవేత విక్కుర్తి. శ్రీనివాసరావు, బాల సాయి కుమార్ వాణిశ్రీ నూతన దంపతులను ఆశీర్వచనాలు అందజేసినారు. ఈ కార్యక్రమంనకు ప్రముఖ న్యాయవాది ఈ క్కుర్తి. రామకృష్ణ పులి గడ్డ. చంద్ర ముసలయ్య బర్మా శ్రీనివాస రావు,కూటమి నాయకులు విచ్చేసినారు.

## మండల పాస్టర్స్ ఫెలోషిప్ సేవకుల సమావేశం



**నందిగామ, ఆగస్టు 7, మేజర్ న్యూస్:** వీర్లుపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సేవకుల సమావేశం పాస్టర్ నవీన్ జాషువా హోసన్నా పెంతుకోస్తు చర్చిలో నిర్వహించారు. ఈ సభలో ప్రసంగీకులు పాస్టర్ శ్యామ్ దైవ సందేశం అందించారు అనంతరం పాస్టర్ సీయోన్ కుమార్ దేవుని వాక్యాన్ని అందిస్తూ, క్రీస్తు మాదిరి, యదార్ధత, పరిశుద్ధత గురించి ప్రజల ఎదుట కనిపించాలని ఆయన తెలియపరిచారు. అనంతరం మండల పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ మంద స్వామి దాస్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి వనరులను మనము సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ప్రభుత్వం కొరకు దేశ రాష్ట్ర క్షేమము కొరకు ప్రత్యేకంగా ప్రార్ధనా చేశారు. చీఫ్ అడ్వైజర్ కె హిజ్కి యా రాజు మాట్లాడుతూ పాస్టర్స్ క్రీస్తు ప్రేమను ప్రకటించుటలో సమాజానికి మాదిరిగా ఉండాలని సమాజసేవ ఎక్కువగా చేయాలని కోరారు. పాస్టర్స్ అందరూ ఐక్యంగా ఉండాలని కోరారు. బిఎస్ పాలు మాట్లాడుతూ చర్చిల మీద అనేకమంది దాడులకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రతి చర్చి మీద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.. ఈ సమావేశంలో పాస్టర్ సిహెచ్ ఏసుదాసు ట్రెజరర్,పాస్టర్ పత్తిపాటి ఆశీర్వాదం సెక్రెటరీ, పాస్టర్ కిషోర్, అబ్రహాము, ఎన్ శామ్యూల్, ఇమ్మానియేల్ తదితర పాస్టర్స్ పెద్ద ఎత్తున పాలు పొంది ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.

## గోళ్ళమూడి సొసైటీ అధ్యక్షులుగా గాడిపర్తి శ్రీనివాసరావు



**నందిగామ, ఆగస్టు 7, మేజర్ న్యూస్:** మండలంలోని గోళ్ళమూడి సొసైటీ అధ్యక్షులుగా గాడిపర్తి శ్రీనివాసరావు నియమితులయ్యారు. శ్రీనివాసరావు గతంలో తెలుగు యువతలో, గ్రామ పార్టీ అధ్యక్షులుగా పలు పార్టీ పదవులు చేపట్టారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు పలువురు తెదేపా శ్రేణులు అభినందనలు తెలిపారు.

# నగరంలో పార్కులను అభివృద్ధి చెయ్యండి





## కొత్త పార్కులకు ప్రణాళికలు సిద్ధం చెయ్యండి

### విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** నగరంలోని పార్కులను అభివృద్ధి చేసి కొత్త పార్కులకు ప్రణాళికలను సిద్ధం చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ ధ్యానచంద్ర హెచ్ యం అన్నారు. గురువారం ఉదయం తన పర్యటనలో భాగంగా ప్రకాశం బ్యారేజ్, కృష్ణలంక, పటమట, పి సి ఆర్ జంక్షన్ ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్క్రాప్ పార్క్ ను సందర్శించి, పార్కులను అభివృద్ధి చేయాలని ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేందుకు ఆహ్లాదకరమైన పార్కులను ఏర్పాటు చేయాలని, తీమ్ పార్కుల నిర్మాణం కోసం ప్రణాళికను రూపొందించాలని డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ ని ఆదేశించారు. నగర పరిధిలోని రోడ్డు లలో గుంతలు లేకుండా చూసుకోవాలని, ప్యాచ్ వర్కు ఎప్పటికప్పుడు వేస్తూ, గుంతలు లేని నగరంగా ఉంచాలని ఇంజనీరింగ్ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి పటమటలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఎల్లప్పుడూ అన్న క్యాంటీన్లో పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోపం ఉండరాదని, వ్యర్థ నిర్వహణ ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని, అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్. శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ కె. అర్జునరావు, పర్యవేక్షణ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి. సత్యకుమారి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు శ్రీనివాసరెడ్డి, జె. శ్రీనివాస్, జి.సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ బాబు శ్రీనివాస్, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, డాక్టర్ అన్నపూర్ణ, బయాలజిస్ట్ కామేశ్వరరావు, రేపటి సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రాంబాబు, మోహన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న కాలనీకి మౌలిక వసతుల కల్పన





**కంచికచర్ల ఆగస్టు 7 మేజర్ న్యూస్ :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా జగనన్న కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించే దిశగా పనిచేస్తామని మండల పరిషత్ అధ్యక్షుడు మలక్ బషీర్ అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్ల లోని జగనన్న కాలనీలను గురువారం ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో కాలనీకి వెళ్లేందుకు రహదారి సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఇంట్లో నుండి బయటికి వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయిందని కాలనీలో నివాసితులు ఇటీవల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీని కలిసి తమ సమస్యలను వినతిపత్రం ద్వారా తెలియజేయడం జరిగింది. వెంటనే స్పందించిన ఎంపీపీ మలక్ బషీర్ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి 8 లక్షల రూపాయలను మండల పరిషత్ నిధులు మంజూరు చేసి కాలనీకి వెళ్ళేందుకు జీఎస్బీతో రోడ్డు నిర్మాణం చేయడం జరిగింది అన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తి అవ్వడంతో ఎంపీపీ రోడ్డు నిర్మాణాన్ని ఎంపీటీసీ మాదుగుల మధు, వైసీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం కాలనీలోని పలువురుతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో బోర్లు పనిచేయడం లేదని, అంతర్గత రోడ్లు సరిగా లేవని, కరకంప చెట్లు దట్టంగా పెరిగి విషపురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఎంపీపీ దృష్టికి తీసుకురావడంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, ఎంపీటీసీ మాదుగుల మధు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు వైభవ పురస్కారానికి జస్టిస్ ఎన్.వీ.రమణ

### మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారం అందచేయనున్న బుద్ధప్రసాద్





**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** భారతదేశ సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య సముపార్జనలో ఆఖరి ఘట్టమైన 1942వ సంవత్సరం ఆగస్ట్ 9వ తేదీ జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం భారతీయులందరికీ చిరస్మరణీయంగా నిలుస్తుందన్నారు. ఈ ఉద్యమంలో మహాత్మా గాంధీ పిలుపుతో ప్రభావితులైన మండలి వెంకట కృష్ణారావు విద్యార్థి దశలోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనటం ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేశారని తెలిపారు. నాటి నుంచి రాజకీయాల్లో మండలి వెంకట కృష్ణారావు ఎంపీ, ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రిగా ఇంకా అనేక పదవులు అలంకరించి రాజకీయ విలువలను కాపాడుతూ గాంధేయ మార్గంలో నిరాడంబర జీవితం గడపారని తెలిపారు. దేశంలో పెచ్చు పెరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా క్విట్ ఇండియా నినాదం స్ఫూర్తితో క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన రోజున హైదరాబాదులో క్విట్ కరప్షన్ ఉద్యమాన్ని నిర్వహించారని తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు ఔన్నత్యాన్ని చాటి చెప్పేందుకు ప్రతి ఏటా ఆయన పేరుతో మండలి ఫౌండేషన్ ద్వారా తెలుగు జాతి వైభవానికి దోహదకారులైన ప్రముఖులకు మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం తో సత్కరిస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ పురస్కారం అంతర్జాతీయ ఖ్యాతి పొందిన గాన కోకిల పీ.సుశీల, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు, ప్రముఖ రక్షణ రంగ శాస్త్రవేత్త డాక్టర్ జి.సతీష్ రెడ్డిలకు అందించి గౌరవించినట్లు తెలిపారు. ఈ ఏడాది నిర్వహిస్తున్న మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా "మండలి వెంకట కృష్ణారావు తెలుగు వైభవ పురస్కారం-2025 భారతదేశ సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కృష్ణాజిల్లాలోని ఒక కుగ్రామంలో జన్మించి పట్టుదల, కృషి, మేధాసంపత్తితో అంచెలంచెలుగా ఎదిగి భారత అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా పదవి బాధ్యతలు నెరవేర్చిన న్యాయదేవత ముద్దుబిడ్డ, తెలుగువారు గర్వించే న్యాయకోవిదుడు జస్టిస్ నూతలపాటి వెంకటరమణకు ఈ పురస్కారం అందించడం తమకెంతో గర్వకారణం అని తెలిపారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 4గంటలకు అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో ఆయనకు ఈ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. క్విట్ ఇండియా ఉద్యమ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సభ అనంతరం మండలి కృష్ణరాయ వైభవం నృత్య రూపకం ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, మండలి అభిమానులు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.



## ఏమిటి ఈ కర్మ ఫలం... ఇది కూడా ప్రజా సేవేనా....?

### శ్రీగురుధాంకు విచ్చేసిన జిల్లెళ్ళమూడి అమ్మ ప్రతిమ

**జగ్గయ్యపేట ఆగస్టు 7 మేజర్ న్యూస్ :** ఏమిటి ఈ కర్మఫలం ఇది కూడా ప్రజాసేవేనా ప్రజలకు మంచి చేసే కార్యక్రమాలకు ఒకే తాటిపై నడవని ఇరుపార్టీల రాజకీయ నాయకులు భక్తి ముసుగులో మాత్రం ఒకే కార్యక్రమంలో పాల్గొనటం పలువురిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. విద్యావంతులై ఉండి విజ్ఞతతో ఉండవలసిన వారు అవివేకంగా భక్తి ముసుగులో బ్రతికున్న మనుషులను పూజించటం, ఆరాధించటం మూఢనమ్మకాల పట్ల విశ్వాసం అద్దం పట్టే విధంగా ఉంది వీరు గురువారం మాజీ ప్రస్తుత ఎమ్మెల్యే భక్తి చూస్తుంటే. వీరు నిత్యం బలుసుపాడు రోడ్డులో ఉన్న గురుధాం ఆశ్రయంలో మనుషులను పూజించడం పట్ల పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్త పరుస్తున్నారు. హైదరాబాదులో రూపుదిద్దుకొని జిల్లెళ్ళముడి క్షేత్రానికి తరలి వెళ్తున్న శ్రీ జిల్లెల్లమూడి అమ్మ జీవ ప్రతిమకు జగ్గయ్యపేట శ్రీ గురుదమ్ ధర్మక్షేత్రం లో ఘనంగా స్వాగతం లభించింది. వారం రోజులు పాటు సద్గురు శ్రీ శివానందమూర్తి భగవానుల సన్నిధిలో విడిది చేసేందుకు విచ్చేసిన అమ్మ ప్రతిమను శివశ్రీ గెంటేల వెంకటరమణ దంపతులు శాస్త్రోక్తంగా ఆహ్వానం పలికారు. శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య జిల్లా జనసేన అధ్యక్షులు సామినేని ఉదయభాను తదితర ప్రముఖులు స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు.

### డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లను

## సుందరంగా తీర్చిదిద్దుతాం

### తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్, గొర్రెపాటి గోపీచంద్, 45వ డివిజన్ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి.వి.ఫణి కుమార్లు కలెక్టర్ ఆఫీస్ దగ్గర ఉన్న రిజర్వాయర్‌కు వెళ్ళు పంపింగ్ మంచినీటి మెయిన్ లైన్ పైపుల మరమ్మత్తులు చేస్తుండడాన్ని చూసి, సిడింబి అగ్రహారంలో గల మున్సిపల్ పార్కు ఇబ్బందులను కూడా మున్సిపల్ ఏ.ఈ. జ్వాలా దీప్తి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగిందన్నారు. గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ నగరంలో డ్రైనేజీ వ్యవ స్థను ప్రక్షాళన చేయడం జరుగుతోందన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సారథ్యంలో డ్రైనేజీల్లో షిల్టు తీయించడం జరుగుతోందన్నారు. మంచినీటి పైపు లైన్ లీకేజీలను పరిశీలించి ఎక్కడికక్కడ అధికారులతో సమీక్షించి లీకేజీలు సరిచేసి ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించే విధంగా రిపేర్లు చేయించడం జరుగుతోందన్నారు. నగర అభివృద్ధి, సంక్షేమమే, కూటమి ప్రభుత్వ లక్ష్యం అన్నారు. డ్రైనేజీలలో షిల్ట్ తీయించి, మంచినీటి పైపులైన్ మరమ్మత్తు లు చేయించి ప్రజలకు శుభ్రమైన మంచినీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆర్వి ఎస్ మురళీధర్, తోట శ్యాం కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

విలేకరులు కావలెను
నేటి దినపత్రిక సూర్య నందు
చందర్లపాడు, ఇబ్రహీంపట్నం, మైలవరం, విసన్నపేట, గంపలగూడెం మండలాల్లో
పని చేయుటకు విలేకరులు కావలెను.
ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999